# గోడ

## తోలేటి జగన్మోహనరావు

నాకు పత్రికా విలేఖరిగా వివిధ పత్రికా కార్యాలయాల్లో పదేళ్ళ అనుభవం ఉన్నా, నేను సాధారణంగా ఆర్థిక విషయాలమీద తప్పితే రాజకీయాలమీద రాస్తుంటాను. అల్లర్లూ, ఆందోళనలూ గురించి ప్రస్తావించినా, రాజకీయాలమీదా, ఆర్థిక ప్రగతిమీదా వాటి పరోక్షప్రభావం గురించి రాయడమే గాని ప్రత్యక్షంగా వాటిని ఎప్పుడూ కవర్ చేయలేదు. అంచేత మా ఎడిటర్‌గారు న్యూఢిల్లీటైమ్స్ తరపున నన్ను హుస్నాబాద్ వెళ్లమన్నప్పుడు కొంచెం సందేహించాను. ఈ విషయాలు సాధారణంగా చూసే దాసు, తల్లికి ఆరోగ్యం బాగాలేక సెలవుమీద వెళ్లడం వలన నేను హుస్నాబాద్ వెళ్ళక తప్పలేదు.

హుస్నాబాద్ పూర్వకాలం, అంటే 1947కి ముందు, ఒక సంస్థానంగా నవాబుగారి పాలన క్రింద ఉండేది. స్వాతంత్ర్యానంతరం ఇండియన్ యూనియన్లో విలీనమయింది. తివాసీలకి, ఇత్తడి సామానుకి పెట్టింది పేరు. జనాభా లక్షపైగా - హిందూ, ముస్లిం జనాభా దాదాపు సమానంగా ఉంటుంది. హుస్నాబాద్‌కి మతకలహాలు కొత్తకాదు. గవర్నమెంటు రికార్డుల్లో 'Communally Hypersensitive' గా ప్రసిద్ధి కెక్కింది.

గత రెండు నెలలుగా అక్కడ పరిస్థితి మళ్ళీ ఉద్రిక్తంగా ఉంది.

హుస్నాబాద్‌లో శిధిలావస్థలో ఉన్న కట్టడం ఒకటుంది. శిధిలమైనది శిధిలమవగా అక్కడ ఒక గోడ మాత్రం మిగిలింది. అది మసీదు అని ముస్లింలు, మందిరం అని హిందువులు గొడవ పడు తున్నారు. ఎవరికి వారు వాస్తుకి సంబంధించిన ఆధారాలు కూడా చూపిస్తున్నారు. ముందు హిందువులు పూజలు మొదలు పెట్టారా, ముందు ముస్లింలు నమాజు చెయ్యడం మొదలుపెట్టారా అనేది స్పష్టంగా తెలియదు కాని అక్కడ పూజలు, నమాజులు ప్రారంభమయ్యాయి. రెండు నెలల క్రితం ఆ గోడని కలుపుకుని రాత్రికి రాత్రి ఒకవైపు మసీదు, మరొకవైపు మందిరం లేచాయి. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితికి కారణం అది. ఈ ఉద్రిక్త పరిస్థితి పూర్వపరాలు విచారించ డానికే నేను మా పత్రిక తరపున వెడుతున్నాను.

నేను న్యూఢిల్లీ స్టేషన్లో రాత్రి ఎనిమిదింటికి బండి ఎక్కాను. బండి హుస్నాబాద్ చేరేటప్పటికి తెల్లవారకట్ల నాలుగవుతుంది. రేపంతా తీరికలేకుండా పని. తిరిగి రాత్రి బయలుదేరి ఎల్లుండి ఉదయానికి ఢిల్లీ వచ్చేస్తాను - అదీ నా కార్యక్రమం. నా కన్నా ముందే ఫోటోగ్రాఫర్ మిశ్రా హుస్నాబాద్ చేరుకున్నాడు. అతనికి ఫోన్లో నేను వస్తున్నట్లు చెప్పాను. తనున్న హోటల్లోనే నాకు కూడా బస ఏర్పాటు చేసినట్లు, తను స్టేషనుకి వస్తున్నట్లు చెప్పాడు.

బండి బయలుదేరబోతుండగా, హడావిడిగా ఓ ఇంగ్లీషు అమ్మాయి బేగ్ తీసుకువచ్చి, నా ఎదుటి బెర్తుమీద కూలబడింది. 'అసలు ట్రెయిన్ మిస్సయి పోతానను కున్నాను' అంది నాకేసి తిరిగి నవ్వుతూ. 'నా పేరు జెన్నీ' అంటూ తనని పరిచయం చేసుకుంది.

ఆ అమ్మాయికి ఇరవై - ఇరవైరెండు కంటె ఎక్కువ ఉండదు. ఒంటరిగా భారత దేశం చూడడానికి వచ్చింది. ఆగ్రా, జైపూర్, బెనారస్, కలకత్తాలు చూసింది. దక్షిణాన బెంగుళూరు, మైసూరు, హైద్రాబాద్‌లు చూసి ఢిల్లీ తిరిగి వచ్చింది. ప్రస్తుతం హుస్నాబాద్ వెడుతోంది. చిరకాలంగా జెన్నీ హుస్నాబాద్ చూడాలను కుంటోందట. నేనూ అక్కడికే వెడుతున్నానని తెలిసి ఆ అమ్మాయి చాలా సంతోషించింది.

'హుస్నాబాద్ చిన్న పట్టణం. సందులూ, గొందులూ, ఇరుకు బజార్లతో చికాకుగా ఉంటుంది. దానికి చరిత్రలో ప్రాధాన్యత ఏమీలేదు - యాత్రాస్థలమూ కాదు' అన్నాను జెన్నీతో.

'యాత్రా స్థలమని కాదు - మా తాత అన్నగారు - మా పెదతాత - హుస్నాబాద్‌లో ఉండేవాడు. ఆయన అక్కడే 1935లో మరణించాడు. ఇంతదూరం ఎలాగూ వచ్చాను కదా! ఆయన నివసించిన స్థలం అదీచూసి తిరిగి వెళ్లిపోతాను...' అంటూ జెన్నీ బేగ్‌లోంచి ఫోటో ఆల్బంతీసి చూపించింది.

ఫోటోలో జాన్సన్ బలిష్టంగా, ఒత్తు మీసాలతో పులిలా ఉన్నాడు. ఖాకీడ్రస్సూ, నెత్తిమీద హేటూ - సైనికుడి యూనిఫాంలో కొన్ని ఫోటోలు ఉన్నాయి. పులిమీద ఒక కాలువేసి తుపాకీ నేలకానించి నిలబడీ, పులిమీద కూర్చుని ఒళ్ళో తుపాకీ పెట్టుకునీ - రకరకాల పోజులలో ఎన్నో ఫోటో లున్నాయి. ప్రతీ ఫోటోలోనూ అతనితో పాటు ఓ కుక్కకూడా ఉంది.


'అదేమిటి? అదికూడా ఆల్బమేనా?' అన్నాను జెన్నీ దగ్గర ఇంకో బైండు చూసి.

'ఇది మా తాత ఆత్మకథ...' అంటూ జెన్నీ, జాన్సన్ ఆత్మకథ - వ్రాతప్రతి ఫోటోకాపీ ఇచ్చింది. ఆత్మకథ పాతటైపురైటరు మీద ఎగుడుదిగుడుగా టైపు చేసి వుంది. దాదాపు రెండొందల పేజీలకు పైగా వుంది.

నాకు ప్రయాణాలలో నిద్రపోయే అలవాటు లేదు. కిటికీలోంచి బయటకు చూస్తూ గడపడమో లేక ఏదైనా పుస్తకం చదవడమో చేస్తుంటాను. కాలక్షేపానికి జాన్సన్ ఆత్మకథ చదవడం మొదలు పెట్టాను. అతను ఆత్మకథ ఒక క్రమపద్ధతిలో రాయలేదు. ఒక సంఘటనలోంచి మరో సంఘటనలోకి వెళ్ళిపోవడం లాంటిది చాలా చోట్ల వుంది. స్పష్టత లేదు. అందువల్లనేమో - ఏ ప్రచురణకర్త దాన్ని ప్రచురించడానికి అంగీకరించలేదు. అతికష్టం మీద పది, పదిహేను పేజీలు చదివాను. అతను బాల్యం గురించి ఏదో రాశాడుకాని అర్థం కాలేదు. విసుగుపుట్టి పక్కన పడేసి- కిటికీ లోంచి బయటికి చూడడం మొదలు పెట్టాను.







వెన్నెట్లో టెలిఫోను స్తంభాలు, పొలాలు, తోటలూ వెనక్కువెళ్ళి పోతున్నాయి. అక్కడక్కడ దూరంగా పల్లెల్లో వెలుగుతున్న దీపాలు, కదులుతూ కన్పిస్తున్నాయి. ఓ గంట అలా కిటికీలోంచి చూసి, విసుగుపుట్టి, నడుంవాల్చి, నా బెర్తుమీద లైటు వెలిగించి, జాన్సన్ పుస్తకం మళ్ళీ అందుకుని తిరగెయ్యడం మొదలు పెట్టాను.

జాన్సన్ జీవితకథ చదవడానికి మొదట విసుగు కలిగించినా, బాల్యం తర్వాత ఆసక్తి కరంగానే సాగింది. అతని పుస్తకం అంతా మొదటి ప్రపంచ యుద్ధంలో ఫ్రాన్సులో అతని అనుభవాలూ, వేట అనుభవాలూ తప్ప మరేవీ కనిపించలేదు. ట్రెంచిలలో అతను గడిపిన జీవితం, యుద్ధంలో అపార జననష్టం, ముఖ్యంగా అతని స్నేహితుడు బిల్ మరణం - వీటన్నిటి ప్రభావం అతని జీవితం మీద చాలా ఉన్నట్లు కనిపిస్తుంది. అతను బిల్ గురించి, బిల్ మరణం గురించి పుస్తకంలో అనేకచోట్ల ప్రస్తావించాడు.

"ఉదయం నుంచీ జర్మన్ ఫిరంగులు గుళ్ళవర్షం కురిపిస్తున్నాయి. మా ట్రెంచి మీదా, చుట్టూరా రెండు గంటలనుంచీ విరామం లేకుండా గుళ్ళు పడుతున్నాయి. ఎంతటి ధైర్యవంతుడికైనా పిరికితనం కలిగించే సన్నివేశం అది. మేమందరం చెవులు మూసుకుని, తలవంచుకుని ట్రెంచిలలో ఒదిగి కూర్చున్నాం. కొన్నిచోట్ల ట్రెంచిలమీద తిన్నగా గుళ్ళుపడి, అక్కడున్న వాళ్ళు అక్కడికక్కడే సమాధి అయి పోతున్నారు. గుళ్ళు సమీపంలో పడినప్పుడల్లా భూమికంపించి పైనుంచి మట్టిపెళ్ళలు పడుతున్నాయి. ఆ పోరులో 'ఇంక భరించ లేను... ఇంక భరించలేను' అంటూ ఎవరో ఏడుస్తున్నట్టు వినిపించింది. నేను తల కదిపి చూశాను బిల్ ఏడుస్తూ పలవ రిస్తున్నాడు.

'బిల్' అంటూ అతన్ని కుదిపాను. తలెత్తి

నాకేసి పిచ్చిచూపులు చూశాడు. అతను అశాంతిగా కదులుతున్నాడు. అతని మానసిక పరిస్థితి నాకు అర్థమైంది. ఇలాంటి బొంబార్డుమెంటులో మతి చలించిన వాళ్ళను చూశాను.

'ఏం ఫరవాలేదు - తొందరలో ముగిసి పోతుంది', అని అతనిమీద చెయ్యవేసి ధైర్యం చెప్పాను. అతను జరిగేది గ్రహించగల స్థితిలో లేడు. 'నాకు చావాలని లేదు - నాకు చావాలని లేదు - నాకు బ్రతకాలని ఉంది, అంటూ లేచి




నిలబడి, ఆపబోతున్న నన్ను విదిలించికొట్టి, ట్రెంచిలోంచి బయటికి దూకి గుళ్ళ వర్షంలోకి పరిగెట్టాడు. నేను ట్రెంచిలో నిలబడి తలెత్తి అతన్ని వెనక్కు రమ్మని అరిచాను. ఆ క్షణంలో ఊళలు వేస్తూ ఓ గుండు సరిగా అతని తలమీద దిగింది. మరుక్షణంలో ఓ మెరుపు.. పెద్దప్రేలుడు.. వేడి గాలి విసురుగా నా మొహాన్ని తాకింది. నేను ట్రెంచిలో కూలిపోయాను. నా తలకి బాంబు తునక తగిలి వుంటుంది. నాకు స్పృహ తప్పింది.

జాన్సన్ తలకి బలమైన గాయం తగిలింది. పదకొండు నెలలు హాస్పిటల్లో ఉన్నాడు. అతనిది మొదటినుంచీ పది మందితో కలిసి మెలిసి తిరిగే స్వభావం కాదు. సైనికుడిగా అతను గడిపిన జీవితం, కళ్ళ ఎదురుగా అతనితో ఉన్న ఒకే ఒక స్నేహితుడు బిల్ దుర్మరణం, తలకు తగిలిన బలమైన గాయం - ఇవన్నీ అతని జీవిత దృక్పథంలో చాలా మార్పు తీసుకువచ్చినట్లు కనిపిస్తుంది.

'నే నెప్పుడు చర్చికి వెళ్ళలేదు - నాకు దేవుడంటే నమ్మకం లేదు - ఒకప్పుడు మనిషంటే నమ్మకం ఉండేది - అదిప్పుడు పోయింది - నాకు నా జిమ్మీ తప్ప ఎవరూ లేరు - నాకు బంధువు, మిత్రుడు, దైవం - అన్నీ నా జిమ్మీయే' అని ఒకచోట రాశాడు జాన్సన్.

జిమ్మీ అతని పెంపుడు కుక్క.

అతను సైన్యం నుండి విడుదలయ్యాక ఇండియాలో అటవీశాఖలో చేరాడు. అతను ఎవరితోనూ కలిసేవాడు కాదు. సాధ్యమైనంత వరకూ నగరాలకి, జనవాసాలకీ దూరంగా మసిలేవాడు. అతనికి వేట ఒక వ్యసనమైంది. పులులు తిరిగే ప్రాంతాలలో ఎరవేసి, మంచె కట్టుకుని పులికోసం ఎదురు చూడకుండా, తుపాకీ భుజాన వేసుకుని, జిమ్మీని తీసుకుని పులివెంట పడేవాడు.

ఆ కుక్క కూడా జాతి కుక్క కాదు. ఎక్కడో దొరికితే చిన్నపిల్లని తీసుకొచ్చి పెంచాడు. అది కూడా విశ్వాసంగా నీడలా వెంట తిరుగుతుండేది. క్లబ్బుల్లోకి అందరూ జాతి కుక్కల్ని తీసుకువస్తే, అతను ఆ ఊరకుక్కని తీసుకు వెడుతుండేవాడు. ఆ కుక్క గురించి ఎవరైనా ఏదన్నా అంటే పోట్లాటకి దిగేవాడు.

అతను ఒంటరివాడు. పెళ్ళి చేసు కోలేదు. ఉన్నది ఒక తమ్ముడు. అతనూ దూరంగా ఎక్కడో ఇంగ్లండులో ఉన్నాడు. అతను ఒకటి రెండుసార్లు ఇంగ్లండు వెళ్ళి తమ్ముణ్ణి చూసి వచ్చాడు. అతనికి ఇంగ్లండు జీవితం నచ్చలేదు. ఇండియాకి తిరిగివచ్చి, ఇక్కడే స్థిరపడిపోయాడు.

అతను ఏభయైలో పడ్డాడు. ఇంక ఉద్యోగం నుంచి రిటైరై విశ్రాంతి తీసుకుందా మని హుస్నాబాద్‌లో ఎవరో నవాబు దగ్గర నుంచి ఒక పాత బంగ్లా కొన్నాడు. ఆ బంగ్లాలో వంటవాడు, ఇద్దరు నౌకర్లూ, అతనూ, జిమ్మీ - అంతే.

ఇలా కాలం నడుస్తుండగా కుమాం పర్వతశ్రేణుల్లో మనుషుల్ని వేటాడుతున్న పులి గురించి అతని చెవిన పడింది. జనం భయకంపితులై ఊళ్ళు వదలి పారి పోతున్నారు. ఒక చోట పశువులు కాసే కుర్రాడిని ఎత్తుకు పోయింది. మరోచోట ఇంట్లో నిశ్శబ్దంగా ప్రవేశించి, పడుకున్న వాళ్ళలో ఒకడ్ని నోట కరచుకు పోయింది. మిగిలిన వాళ్ళకు మెలకువైనా రాలేదు. ఆ పులిని చంపడానికి వెళ్ళిన ఇద్దరిలో ఒకడు తిరిగి రాలేదు; ఒకడు ఒక కాలుతో తిరిగి వచ్చాడు. అసలు అది పులికాదనీ, మనిషి రక్తానికి అలవాటు పడిన మంత్రగత్తె అనీ, రాత్రివేళ అది పులిగా మారి మనుషుల్ని తింటోందని కథలు ప్రచారంలోకి వచ్చాయి. ఒక గ్రామశివార్లలో ఒంటరిగా ఉంటున్న ఓ ముదుసలిని మంత్రగత్తె అని అనుమానించి, తలుపుకి గొళ్ళెంపెట్టి, గుడిసె అంటించి చంపేశారు జనం.

ఈ కథలన్నీ వింటూన్న జాన్సన్ ఇంక ఉండబట్టలేక పోయాడు. జోడుగుళ్ళ తుపాకీ భుజాన వేసుకుని, జిమ్మీని వెంట బెట్టుకుని బయలుదేరాడు. ఈ వయసులో అది దుస్సాహసమని కొందరు ఆపడానికి ప్రయత్నించారు. అతను ఎవరిమాటా వినలేదు. అతను పులివేటాడే తీరు, తిరిగే మార్గం, అంతా జాగ్రత్తగా పరిశీలిస్తూ అడవుల్లో మూడునెలలు తిరిగాడు. ఒకటి రెండుసార్లు పులి గంటల తేడాలో తప్పించుకు పోయింది. ఈ మూడునెలల లోగా మరో పదిమంది పులివాత పడ్డారు. జాన్సన్‌కి పిచ్చెక్కినట్లయింది.

ఒకరోజు ఉదయం సమీపగ్రామ శివార్లలో పులి కనిపించదని జాన్సన్‌కి కబురందింది. అతను హుటాహుటి అక్కడకు వెళ్ళాడు. అడుగు జాడలు పరిశీలించి తను వెతుకుతున్న పులే అని గ్రహించాడు. ఆ అడుగుజాడలు, అది నడిచిన దారిలో వంగిన ఆకులూ, విరిగిన కొమ్మలూ చూసుకుంటూ అడవిలోపలి కంటా వెళ్ళిపోయాడు. పులి నడుస్తున్న దారిలో చెట్లమీంచి లేస్తున్న పక్షుల కిల కిలారావాలు, కోతుల అరుపులూ, అన్నీ జాగ్రత్తగా వింటూ, అది వెడుతున్న దారి గమనిస్తూ వెంటాడాడు. కాని ఎక్కడో జాడ తప్పింది. పులి కనుమరుగైంది. అడవి నిశ్శబ్దమైంది.

అప్పటికి మధ్యాహ్నం రెండుగంట

లయింది. అతను చాలా అలిసిపోయాడు. వయసులో అయితే రోజులకు రోజులు ఒంటరిగా అడవిలో గడిపేవాడు. ఏభైవ పడిలో పడ్డాక చూపు, వినికిడి, ఘ్రాణశక్తీ - అన్నీ మందగిస్తున్నాయి. రాత్రిళ్ళు చూపు సరిగా ఆనడం లేదు. చీకటి పడేలోగా ఏ గ్రామమైనా చేరుకోవాలని తిరుగుముఖం పట్టాడు.


సాయంకాలం అయిదు గంట లయింది. అడవిలో వెలుగుతగ్గి నీడలు సాగుతున్నాయి. జాన్సన్ కొండదారిన నడుస్తూ, నడుస్తూ ఆగిపోయాడు. ముందు దారి పదిగజాల అవతల వంపు తిరుగు తోంది. ఒంపు దగ్గర పెద్ద బండరాయి ఒకటి ముందుకు వచ్చింది. కాలిబాట దాన్ని చుట్టి క్రిందకు పోతోంది. ఆ ప్రదేశమంతా పొదలతో, తుప్పలతో నిండి వుంది. అక్కడ, ఆ ప్రదేశంలో, అప్పుడు ఎందుకు ఆగి పోయాడో అతనికే తెలియదు. బహుశా 'ఆరవ ఇంద్రియం' అతన్ని హెచ్చరించి ఉంటుంది.

అతని వెనకవైపు నించి గాలి వస్తోంది. గాలి వాలులో ఉన్న పులి తన వాసన పసి గట్టగలదు కాని పులివాసన తనకు తెలియదు. పులిమాటు వెయ్యడానికి అనువైన ప్రదేశం అది. పులి తనకోసం అక్కడ కాచుకుని ఉందని ఎందుకో అనుమానం వచ్చింది అతనికి.

అతను ఆగగానే జమ్మీకూడా ఆగి పోయింది. అతను జోడుగుళ్ళ తుపాకీ చేతుల్లోకి తీసుకుని, జాగ్రత్తగా గురిచూస్తూ ముందుకు నడవసాగాడు. జమ్మీకూడా నిశ్శబ్దంగా అతనితోపాటు కదిలింది. అతను మెల్లిగా కొండరాయి కిందకు వచ్చాడు. ఇంకో నాలుగడుగులేస్తే మలుపు వస్తుంది. ఆ మలుపు చాటునే పులి వుందని అతని అనుమానం.

అతని దృష్టి అంతా ముందు దారి మీదే వుందికాని పులి బండరాయిమీద నిలబడి పైనుంచి తనకేసే చూస్తున్నదని అతను గమనించలేదు. మరో అడుగు వెయ్యగానే జమ్మీ పైకి చూసి అరవడం, పులి అతనిమీదకు దూకడం, అతను వెనక్కు తిరిగి తుపాకీ పైకెత్తి పేల్చడం - అన్నీ ఒకేసారి జరిగాయి. తుపాకీ గురి తప్పింది. పులి గుర్రుమంటూ అతనికేసి చూస్తూ నిలబడింది.

అతని ఆలోచనలకూ, చర్యలకూ సమన్వయం వయసుతోపాటు తగ్గిపోయింది. పదేళ్ళక్రితమైతే ఆ పరిస్థితిలో అసంకల్పితంగా




తుపాకీ ఎత్తి పులికదిలేలోగా మళ్ళీ పేల్చగలిగేవాడు. ఆరడుగుల దూరంలో నిలబడివున్న మృత్యువుని చూడగానే అతను ఏంచెయ్యాలో తోచక స్థాణువులా నిలబడి. పోయాడు పోయాడు. పులి గుర్రు గుర్రు మంటూ, వెనుక కాళ్ళమీదికి జరిగి ముందుకు, మీదకు దూకడానికి సిద్ధమవుతోంది.

అతను తేరుకుని తుపాకీ ఎత్తి గురిచూడ టానికి క్షణం పట్టింది. ఆ క్షణం అతనికి తన ప్రాణాలు బలిపెట్టి ఇచ్చింది. జమ్మీ. యజమాని మీదకు దూకబోతున్న పులిమీద కురికి వెనకకాలు పట్టుకుంది. పులి వెనక్కు తిరిగి జమ్మీని పంజాతో విదిలించి కొట్టి, మళ్ళీ జాన్సన్ వైపు తిరిగేలోగా తుపాకీ పేలింది. పులి ఎగిరిపడింది. అది కదలడం ఆగిపోయేవరకూ మళ్ళీ మళ్ళీ తుపాకీ పేలింది. పులి చచ్చిపోయిన తర్వాత జాన్సన్ ఏడుస్తూ పది అడుగుల దూరంలో రక్తపు మడుగులో ఉన్న జమ్మీ దగ్గరకు.....

బండి, చక్రాలు కీచుమంటూ, సడన్‌బ్రేక్ వేసినట్టుగా కుదుపుతో ఆగింది. నేను, జాన్సన్ ప్రపంచంలోంచి హఠాత్తుగా బాహ్య ప్రపంచంలోకి వచ్చి పడ్డాను. ఆ కుదుపుకి జెన్నీకి కూడా మెలకువ వచ్చినట్లుంది. 'ఏమైంది?' అనడిగింది.

'సిగ్నలుకోసం అయివుంటుంది,' అన్నాను.

అలా ఆగిన బండి అరగంటయినా కదలలేదు. నేను టైము చూశాను. నాలుగవు తోంది. అంటే ఈనాటికి హుస్నాబాద్ వచ్చేసి ఉండాలి. మరో పదిహేను నిమిషాలు గడిచాయి. బండి నిశ్శబ్దంగా అలాగే నిలబడి ఉంది. నేను కిటికీ అద్దం పైకెత్తి చూశాను. కనుచూపుమేర చెరుకుతోటలు వెన్నెల్లో స్నాన మాడుతున్నాయి. రైలుపట్టాల పక్కనే పిల్లకాలువ ఒకటిపోతోంది. దానిలో నీరు అడ్డకట్టదాటి ఎడమనుంచి పల్లానికి గల గల చప్పుడు చేస్తూ ప్రవహిస్తోంది.

'ఏమైంది?' - జెన్నీ మళ్ళీ అడిగింది.

'చూసి వస్తాను,' అంటూ నేను తలుపు తీసి, బయటకు నడిచి కంపార్టుమెంటు లోంచి తొంగి చూశాను. అప్పటికే చాలా మంది ప్రయాణీకులు బండి దిగి నిలబడి చూస్తున్నారు. వాళ్ళు చూస్తున్నవైపు నేనూ దృష్టి సారించాను. దూరంగా ఎడంవైపు ఆకాశమంతా ఎర్రగా కనుపిస్తోంది.

నేను అటే చూస్తూ కిందికి దిగి, 'ఏమిటది?' అనడిగాను - అక్కడ మెల్లిగా మాట్లాడుకుంటున్న గుంపు దగ్గరచేరి

'చెరుకుతోటల్లో తుక్కు తగలబెడు తున్నారేమో - లేకపోతే బెల్లం వండుతున్నారో?' అన్నాడు ఒకడు.

'నై... నై... ధంగా షురూ హోగయా,' అన్నాడు మరొకడు ఉద్రిక్తంగా.

ఆ వెలుగు చెరుకుతోటల్లోంచి కాదనీ, తగలబడుతున్న హుస్నాబాద్ నుంచనీ బండిలో ఉన్నవాళ్ళందరికీ త్వరలోనే అర్థమైంది. హుస్నాబాద్ మీదుగా దూర ప్రాంతాలకు పోయేవాళ్ళు ఆసక్తికరంగా చూస్తుంటే, హుస్నాబాద్‌లో అయినవాళ్ళు ఉన్నవాళ్ళు గుండెలు బాదుకుంటూ ఏడవడం మొదలుపెట్టారు.

ఆ ఆగడం, ఆగడం, బండి ఉదయం ఆరుగంటలదాకా అలాగా ఆగిపోయింది. జెన్నీ రెండు మూడుసార్లు, 'ఏమిటి? బండి ఇంతసేపు

ఆగింది?' అనడిగింది. ఆమెకు విషయం చెప్పకుండా, 'మవ్వు ఈ సమయం లో రాకుండా ఉండాల్సింది,' అన్నాను.

తెల్లవారింది. లే ఎండపడి రాత్రి మంచులో తడసిన చెరుకుగడలు ఎర్ర ఎర్రగా మెరుస్తున్నాయి. తోటలమీద పిట్టలు కిచకిచమంటూ ఎగురుతున్నాయి. దూరంగా పొగమంచు చెరకుతోటల మీద కమ్ముకుంటోంది. పిల్లకాలువలో నీళ్ళు అలాగే గలగలమని చప్పుడుచేస్తూ ప్రవహిస్తున్నాయి.

ఈ ప్రశాంత దృశ్యానికి, తర్వాత చూడబోయే ఘోరకలికి ఎంత తేడా! వెలుగు వచ్చాక ఆకాశంలో ఎర్రదనం కనుపించడం లేదుగాని హుస్నాబాద్‌మీద నల్లటిమేఘం అలుముకున్నట్లుంది.

ఆరుగంటలకి బండి బయలుదేరి, వెళ్ళాలా వద్దా అని సందేహిస్తున్నట్లు, చాలా మెల్లిగా నడుస్తూ, ఆగుతూ, మరో గంటకి హుస్నాబాద్ స్టేషన్ చేరుకుంది. బండి ప్లాట్‌ఫాం మీద ఆగకుండానే కెరటం విరుచుకు పడ్డట్లు జనం బండిమీద పడ్డారు. తోసుకుంటూ, గెంటుకుంటూ, పడిపోయిన వాళ్ళని తొక్కుకుంటూ కిటికీ ఊచలు పట్టుకుని వేళ్ళాడుతూ, తలుపులు తియ్యమని దబదబ బాదుతూ, బండికూడా పరిగెట్టారు జనం.

అంత జనసందోహం, ఆ గందరగోళం, తొక్కిసలాట, ఏడుపులు - అదంతా జెన్నీ ఎప్పుడూ చూసి ఉండదు. ఏమైంది అనడిగింది. ఆ అమ్మాయి మొహంలో భయం స్పష్టంగా కనిపిస్తోంది. దిగకుండా అదే బండిలో వెళ్ళిపొమ్మని ఆమెకు సలహా యిద్దామనుకున్నాను కాని పరిస్థితి చూస్తే బండి కదిలేలా లేదు. జనం చీమల్లా బండి కప్పుమీదకు పాకేస్తున్నారు.

జెన్నీకి బేగ్ తీసుకోమని చెప్పి తలుపు తీశాను. తలుపు తియ్యగానే జనం బోగీలోకి విరుచుకుపడ్డారు. ఆ తొక్కిసలాటలో ఎలా ముందుకు వెళ్ళగలిగామో నాకే తెలియదు. జెన్నీ చెయ్యి పట్టుకుని జన ప్రవాహానికి ఎదురీదుతూ అతికష్టం మీద స్టేషను మాష్టారి గదికి చేరాను. అక్కడనుంచి మిశ్రాకి ఫోను చేద్దామని పబ్లిక్ టెలిఫోను తీశాను. అది పనిచెయ్యడం లేదు. ఇంక స్టేషను మాష్టారిని ఆశ్రయించడం తప్ప గత్యంతరం లేకపోయింది.

స్టేషను మాష్టారు మొదట నేను చెప్పేదేవీ వినిపించుకోలేదు. నేను 'ప్రెస్' అనగానే కొంచెం ఆగి నా మాట విన్నాడు. అతనికి విషయమంతా చెప్పి రిటైరింగ్‌రూం ఏదైనా ఖాళీగా ఉంటే జెన్నీకి ఇవ్వమనీ, ఢిల్లీకి వెళ్ళే మొట్టమొదటి బండిలో తిరిగి వెళ్ళిపోతుందనీ చెప్పాను.

స్టేషనులో అంగుళం జాగా కూడా ఖాళీగా లేదు. జనంతో కిట కిటలాడి పోతుంది. రిటైరింగ్ రూం ఒకటుంది కాని ఆ తలుపులు తియ్యడం అసంభవం. ఒక వేళ గది తలుపులు తెరవగలిగినా జనం లోపలికి తోసుకు వచ్చేస్తారు. జెన్నీ ఉండడానికి వీలుపడుదు. అతను కాసేపు ఆలోచించి, 'ఆ అమ్మాయికి అభ్యంతరం లేకపోతే మా ఇంట్లో ఉండొచ్చు. బళ్ళు ఎప్పుడు నడిస్తే అప్పుడు వెనక్కు పంపిం చేస్తాను,' అన్నాడు.

జెన్నీతో అతను అన్నది చెప్పాను. ఆ అమ్మాయి చాలా మొహమాట పడింది. ఏదైనా హోటల్లో రూం దొరకదా అంది. పట్టణ పరిస్థితి ఆ అమ్మాయికి పూర్తిగా అర్థమైనట్లు కనుపించలేదు. అంతా వివరంగా చెప్పాకా ఆ అమ్మాయి ఒప్పు కుంది. స్టేషను మాష్టారు కూలీని తోడిచ్చి జెన్నీని తన ఇంటికి పంపించాడు...

ఏ వాహనం దొరికితే ఆ వాహనం తీసుకునీ నడిచీ, జనం ఎడతెరిపి లేకుండా స్టేషనుకి వచ్చి పడుతున్నారు. పట్టణం నుంచి ప్రాణాలతో బయటపడాలనీ, ఎక్కడికో అక్కడికి పారిపోవాలనీ ఆరాటం. నేను పోలీసు జీపులో నా బసకి బయలు దేరాను. పట్టణంలో కర్ఫ్యూ ఉందికాని అమలు జరపడానికి తగిన పోలీసు బలగం ఉన్నట్లు లేదు. దారిపొడుగునా విచ్చల విడిగా తిరుగుతున్న మూకలూ - కాలుతున్న ఇళ్ళూ, దుకాణాలు, కార్లు, బస్సులు, ట్రక్కులూ.....

ఇంత ఉద్రిక్తపరిస్థితిలో రోడ్డుమీద డాన్సు చేస్తున్న ముగ్గురు కుర్రాళ్ళని చూసి ఆశ్చర్యపోయాను. పోలీసు జీపు కంట బడగానే వాళ్ళు పక్కనందులోకి పారి పోయారు. పట్టణమంతా తగులబడుతుంటే వీళ్ళు రోడ్డుమీద ఇలా డాన్సు చేస్తున్నారేమిటి అని తెల్లబోతున్న నాకు జీవితంలో ఎన్నడూ మర్చిపోలేని షాక్ తగిలింది. ఒక మనిషి మరో మనిషిపట్ల అంత క్రూరంగా ఉండ గలడని నేను ఎప్పుడూ అనుకోలేదు. నేను స్వయంగా చూడకపోతే నమ్మేవాడినికాను. నేను ఈ విషయం చెబితే మరొకరు నమ్మక పోయినా ఆశ్చర్యపోను.

ఆ కుర్రాళ్ళు డాన్సు చేస్తున్నది రోడ్డు మీద కాదు - రోడ్డుమీద బోర్లాపడి వున్న ఓ పదిహేడేళ్ళ కుర్రాడి శవం మీద.

'బాబూజీ ఠర్ గయా,' అన్నాడు జీపు నడుపుతున్న కానిస్టేబుల్ నవ్వుతూ, శవం పక్కనుంచి జీపుపోతుంటే, నా కళ్ళల్లో అతనికి భయం కనుపించింది కాబోలు. అతను శవంకేసి చూడనైనా చూడలేదు. ఆ విషయం అంత తేలిగ్గా ఎలా తీసుకో గలిగాడా, ఏదో జోకువేసినట్లు. ఎలా నవ్వగలిగాడా అని నాకు ఆశ్చర్యమేసింది. బహుశా అతని మనసు ఇటువంటి దృశ్యాల్ని చూసి, చూసి బండబారిపోయి ఉంటుంది. నాకు ఇది కొత్త కావచ్చు. అతను తన సర్వీసులో ఇటువంటి దృశ్యాలు ఎన్ని చూశాడో!

నన్ను హోటలు దగ్గర దింపి జీపు వెళ్ళిపోయింది.

'వచ్చావా బాస్,' అన్నాడు మిశ్రా. మనిషి షేక్ అయిపోయినట్లు కనుపించాడు. అతని కళ్ళు ఎర్రగా ఉబ్బి ఉన్నాయి. రాత్రి నిద్ర పోయినట్లు లేదు.

'ఏమన్నా తిన్నావా?' అనడిగాడు.

'ఏం తినలేదు - తినాలనిపించడం లేదు,' అన్నాను నేను చూసినది గుర్తుకువచ్చి

'ఇప్పుడే ఏదైనా, తీసుకో - బయట



"కళ్ళు కన్పించవుసార్! పావలా దానం చేయండిసార్!"

"సారంటావేం! నేను అమ్మాయినయితే-"

"క్షమించుతల్లీ! నీ జీన్‌ఫాంట్ చూసి అబ్బాయివనుకున్నా.

జరుగుతున్నది చూసిన తర్వాత ఇంక తినలేవు - నిద్రపోలేవు,' అంటూ బ్రెడ్, టీ తెప్పించాడు. అయిష్టంగానే రెండు స్లైసులు తిని, టీ తాగాను.


'నిన్న ఉదయం ఫోన్లో మాట్లాడినప్పుడు ప్రశాంతంగా ఉందికదా,' అన్నాను.

'ప్రశాంతంగానా? మందుపాతర పేలడానికి సిద్ధంగా ఉంది - నిన్నరాత్రి రెండు గంటలకి అంటుకుని పేలింది. రావుసాబ్! నేను పాలుతాగే పిల్లాణ్ణి కాదు - ఢక్కామొక్కీలు తిన్నవాణ్ణి - రక్తం, చావు చూస్తే జడుసుకునే వాణ్ణి కాను - కాని ఇలాంటిది ఎప్పుడూ చూడలేదు.....

రావుసాబ్! కొన్ని మాటలకి అర్థం అనుభవిస్తేనే కాని తెలియదు. అర్ధరాత్రి నిశ్శబ్దం లో హఠాత్తుగా పరిగెడుతున్న జనం అడుగుల సవ్వడి - గోలగా కేకలు, కెవ్వున ఏడుపులు - గాఢనిద్రలోంచి ఉలిక్కిపడి కళ్ళుతెరచి చూస్తే గది గోడలమీద కొండ చిలువల్లా కదులుతున్న నల్లటి, ఎర్రటి నీడలు ఏం జరుగుతున్నదో అర్థంకాక దడ దడలాడుతున్న గుండెలతో కిటికీ దగ్గరకు పరుగెట్టి చూస్తే మంటల వలయంలో చిక్కుకుని కాలిపోతున్న నిండుప్రాణాల ఆర్తనాదాలు - ఇదంతా నా అనుభవంలోకి వచ్చేవరకు నాకు భయం అనే మాటకు అర్థం తెలియలేదు.....' మిశ్రా మాట్లాడుతూ కిటికీ కర్టెను లాగాడు. నాలుగో అంతస్తు కిటికీలోంచి క్రింద నాలుగు రోడ్లకూడలి కనిపిస్తోంది.

'ఆ మేడ చూశావా' - ఓ మూల సన్నటి పొగలు వస్తున్న భవనం చూపిస్తూ అన్నాడు మిశ్రా - 'కింద పెయింట్ల షాపుకి మూకలు అంటించడంతో పైన ఉన్న కుటుంబానికి పారిపోవడానికి అసలు అవకాశం లేకుండా పోయింది. క్షణాలలో మేడంతా మండ సాగింది. నిద్రలో ఉన్నవాళ్ళు, ఎలా ఉన్నవాళ్ళు అలా టెర్రసుమీదికి పరిగెట్టు కొచ్చారు. అంతా నేను ఈ కిటికీలోంచి చూస్తూనే ఉన్నాను పదకొండుమంది నీడల్లా అటు ఇటూ పరిగెడుతూ, గొల్లు గొల్లున ఏడుస్తూ, జుట్టు పీక్కుంటూ, దేవుణ్ణి వేడుకుంటూ, సజీవంగా తగలడిపోవడం నా కళ్ళతో చూశాను.

.... ఆ తల్లి అలా ఎందుకు చేసిందో నాకు అర్థం కాలేదు. బహుశా ఆమెకు ఏం చెయ్యాలో తోచి ఉండదు. లేదా తన బిడ్డ తన కళ్ళెదురుగా కాలిపోవడం చూడలేక అలా చేసి ఉంటుంది. అంతవరకు గుండెలకు హత్తుకుని, మంటలు, పొగలు తప్పించుకుంటూ అటు ఇటూ పరుగెడు తున్నది, ముందుకు వచ్చి నెలల పిల్లాణ్ణి కిందకు విసిరేసింది. బహుశా మంటలకు దూరంగా విసిరేద్దామనుకొని ఉంటుంది. ఆ కుర్రాడు కరెంటుతీగలమీద పడి, ఎగిరి, సరిగ్గా పొయ్యిలా మండుతున్న షాపులో ఏదో బొమ్మపడ్డట్టు పడ్డాడు. కాగితం ముక్క కాలిపోతూ, వంకరలు తిరిగి నల్లబడి పోయినట్లు, వాడి కాళ్ళుచేతులూ వంకర పోతూ, మెల్లిగి మంటల్లో అదృశ్య మయ్యాడు. వాడి




దగ్గరనుంచి ఒక్క శబ్దం కూడా రాలేదు.

క్రిష్టియన్లు అంటుంటారే - ఏసు శిలువ మీద మనకోసం తన రక్తం చిందించెను అని - అలా బహుశా వాడు మన పాపాలు మనకు గుర్తుచేస్తూ మనకోసం మౌనంగా కాలి పోయాడేమో! వాడి ఏడుపు శవంలా వినిపించినా నాకు మనశ్శాంతి ఉండేది. ఆ మౌనమే.....,' మిశ్రా మరి మాట్లాడలేక ఆగి పోయాడు - 'రావుసాబ్! పిల్లలు దేవుళ్ళంటారు. మరి ఈ దేవుళ్ళని బలి తీసుకునే దేవుడు ఎలాంటి దేవుడు? ఈ రాక్షసుల దేవుడు దేవుడు కాదు - సైతాను' అన్నాడు కొంచెం కోలుకున్న తర్వాత.

'పద' అన్నాను లేస్తూ

'ఎక్కడికి?'

'యస్పీని కలుద్దాం'

'ఇప్పుడా?', మిశ్రా తెల్లబోయి అన్నాడు, 'బయట పరిస్థితి నీకు తెలిసినట్లు లేదు. నీ ప్రెస్ ఐడెంటిటీ కార్డుకి బయట మూకలు గడ్డిపరక కిచ్చిన విలువకూడా ఇవ్వవు,' అలా అన్నాడేకాని నేను లేవడం చూసి తనకూడా మాట్లాడకుండా కెమేరా తీసుకుని నాతో వచ్చాడు.

యస్పీ ఆఫీసు దగ్గరే అర కిలోమీటరు దూరంలో ఉంది. ఆ అరకిలోమీటరు రోడ్డు రాళ్ళు చిమ్మినట్టుగా వుంది. రోడ్డు కిరుపక్కలా తగలబడుతున్న ఇళ్ళు, దుకాణాలు, రోడ్డుమీద పొగలు కక్కుతున్న లారీలు, బస్సులు - అక్కడక్కడ టెలిఫోను స్తంభాలు, రాళ్ళతో బారికేడ్లు - దూరంగా 'అల్లాహో అక్బర్', 'హర హర మహదేవ' అని కేకలు - తుపాకీ కాల్పులు - అరుపులు - ఏడుపులు - ఆ అరకిలోమీటరు దూరంలో కనీసం ఇరవై శవాలన్నా చూశాం. మేం మాత్రం ఏం అవాంతరం జరగకుండా యస్పీ ఆఫీసు చేరాం.

యస్పీ ఆఫీసు రణరంగంలా వుంది. ఓ వందమంది సాయుధ పోలీసులు ఉక్కు టోపీలు, రాళ్ళదెబ్బలు తగలకుండా వెదురుతో చేసిన జాకెట్లు వేసుకుని సిద్ధంగా వున్నారు. వాళ్ళచేతుల్లో ఫేముతో తయారు చేసిన డాలులు ఉన్నాయి. వాళ్ళ ప్రక్కన రెండు లారీలు నిలబెట్టి ఉన్నాయి. ఆ లారీలు కాక నాలుగు జీపులున్నాయి. ఆఫీసులో యస్పీయే కాకుండా, డిస్ట్రిక్టు మేజిస్ట్రేటు కూడా ఉన్నాడు. యస్పీ రెండు నెలల నుంచి అక్కడే కేంపు వేసి ఉన్నాడు.


అక్కడ కంట్రోలు రూంలో విరామం లేకుండా ఫోనులు మోగుతున్నాయి. యస్పీ క్షణం తీరిక లేకుండా ఉన్నాడు.

'అసలు ఇదంతా ఎలా మొదలయింది? ఇంత పెద్ద ఎత్తున ఇలా జరగడం ఆశ్చర్యం గా వుంది!' అన్నాను యస్పీతో ఫోనుకి ఫోనుకి మధ్య విరామంలో.

'ఆశ్చర్యం దేనికి? కళ్ళున్న వాడి కెవడికైనా

ఇవాళ కాకపోతే రేపైనా ఇలా జరగక తప్పదని తెలుస్తూనే వుంది,' అన్నాడు యస్పీ బెనర్జీ. అతను ఐ.పి.యస్ - ముప్ఫయి, ముప్ఫయైదు కంటె ఎక్కువ ఉండదు అతని వయసు 'రెండు పక్షాలు కయ్యానికి కాలు దువ్వుతున్నప్పుడు కారణాల కోసం వెతకక్కర్లేదు. ఆడ, మగ వ్యవహారాలు, ఇరుగు పొరుగు తగాదాలు, రౌడీ ముఠా అంతర్యుద్ధాలు, స్కూలు కుర్రాళ్ళ కొట్లాటలు - ఏ చిన్నరవ్వయినా చాలు అంటుకోడానికి.'

రెండు పక్షాలు తయారవుతున్నాయని అంత స్పష్టంగా తెలిసినప్పుడు పోలీసులేం జేస్తున్నారు,' అన్నాను.



నా ప్రశ్న యస్పీకి కోపం తెప్పించి నట్లుంది. అతను నాలుగు రోజులనుంచీ సరిగా నిద్రాహారా ల్లేకుండా రాత్రీపగలూ ఠానాలో ఉంటూ చాలా చికాగ్గా వున్నాడు.

'పోలీసులేం చెయ్యగలరు?' - బెనర్జీ విసురుగా ఎదురు ప్రశ్న వేసాడు - 'ఇక్కడ చలామణిలో ఉన్న ఆడియోకేసెట్లు విన్నావా? ఇనామ్‌లు, సాధువులు మతం పేరుతో జనాల్ని ఎలా రెచ్చగొడు తున్నారో తెలుసా? వాళ్ళమీద ఏ చర్యా తీసుకోలేని పోలీసుల నిస్సహాయత గురించి నీ పేపర్లో రాసే ధైర్యం నీకుందా? ప్రార్థనా స్థలాల్లోకి, హంతకులకి, సాయుధ గూండాలకి ప్రవేశం వుంటుంది కాని వాళ్ళని వెంటాడుతూ పోలీసులు ప్రవేశిస్తే పెద్ద ఆందోళన - మత హక్కులు, పౌర హక్కులు అంటూ మీ పత్రికల్లో కాకిగోల - మిస్టర్ - ఒకటి స్పష్టంగా అర్థం చేసుకో - ఈ రోజు విఫలమయ్యింది పోలీసులొక్కళ్ళే కాదు - మొత్తం ప్రభుత్వ యంత్రాగం - ఆ పైన సమాజం - అసలు మీరందరూ ఈ పరిస్థితికి ఎంతవరకూ బాధ్యులో ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోండి...' అంటూ చాలా ఘాటుగా మాట్లాడాడు.

యస్పీ బెనర్జీ అలా మాట్లాడుతుంటే బయట కలకలం వినిపించింది. ఒక కానిస్టేబుల్ లోపలికొచ్చి, సెల్యూట్‌కొట్టి నిలబడి, 'సాబ్' అన్నాడు భయపడుతూ, భయపడుతూ

'ఏమిటి'

'యమ్మెల్యే సాబ్ జనాన్ని తీసుకుని ఇటువైపు వస్తున్నాడు సాబ్! మొన్న మనం అరెస్టు చేసిన ఆయన మనుషులందర్నీ వదిలెయ్యాలంటున్నాడు' అని చెప్పాడు.

'గేట్లు వేసెయ్యండి' అన్నాడు యస్పీ బెనర్జీ.

పాతకాలపు పోలీసు ఠానా కోటలాగా ఎత్తు ప్రహరీగోడతో ఉంది. దానికున్న పెద్ద ఇనుప గేటు మూసేసారు. నేను యస్పీ పక్కనే వరండాలో నిలబడి చూస్తున్నాను.

ఐదు నిముషాలలో రెండు మూడు వందల మంది వున్న మూక పోలీసు ఠానా మీద విరుచుకు పడింది. వాళ్ళ చేతుల్లో కత్తులు, గొడ్డళ్ళు, ఇనపరాడ్లు, తుపాకులు, పెట్రోలు టిన్నులు, కాగడాలు..... గేటు ఊచలు పట్టుకుని గుంజుతూ అరవడం మొదలు పెట్టారు - 'యస్పీ డౌన్! డౌన్! - పోలీసుల జులుం నశించాలి.....!

అందరికంటె ముందున్న వ్యక్తి పంచె, లాల్చీ, వెయిస్టుకోటు వేసుకున్నాడు. చూడగానే వీడు గూండా నెంబర్‌వన్ అనిపించేలా వున్నాడు. వాడు గేటు ఓ తోపు తోసి, 'పాఠక్ భోలో' అనరిచాడు.

యస్పీ మైకు తీసుకుని, 'పట్టణంలో కర్ఫ్యూ విధించబడింది. దయచేసి అందరూ వెంటనే వెళ్ళిపొండి. రోడ్లమీద ఎవరూ తిరగకూడదు' అని చెప్పాడు,

సమాధానంగా ఠానా మీద రెండు నిమిషాలు రాళ్ళ వర్షం కురిసింది. మూక లోంచి రెండు మూడు తుపాకులు గాలిలోకి పేలాయి.

'సాబ్! వాళ్ళని మనం వదిలెయ్యక పోయినా వాళ్ళు ఎలాగా రేపుకోర్టులో బెయిలు మీద విడుదలయిపోతారు. మళ్ళీ ధంగా మొదలు పెడతారు. ఇది వాళ్ళకి అలవాటే. వాళ్ళకి వ్యతిరేకంగా కోర్టులో ఎవరూ సాక్ష్యం చెప్పరు. ఈ మాత్రం దానికి వాళ్ళతో విరోధం తెచ్చుకోడం దేనికి సాబ్' - క్రింది ఆఫీసరు అనుభవ పూర్వకంగా చెబుతున్న మాటలు బెనర్జీ విన్నాడు కాని ఏం సమాధానం చెప్పలేదు. డి.యం.వైపుకి తిరిగి అతనితో మెల్లిగా మాట్లాడాడు. డి.యం. అంగీకరిస్తున్నట్లు తలూపాడు.

బెనర్జీ మైకు తీసుకుని, 'అందరూ వెళ్ళిపోడానికి సరిగ్గా నిమిషం టైమిస్తున్నాను. లేకపోతే కాల్పులు జరపాల్సి ఉంటుంది అని హెచ్చరిక చేశాడు. వెంటనే సాయుధ పోలీసులు పొజిషను తీసుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా తయారవుతోంది.

'సాలే యస్పీ....' ముందున్న వ్యక్తి ఉద్రిక్తంగా ఊగిపోతూ బూతులు గుప్పించడం మొదలుపెట్టాడు, '..... నా గురించి ఏవను కుంటున్నావురా - మా కి...'

సరిగా నిమిషం తర్వాత పోలీసు తుపాకులు గుంపు మీదుగా గాలిలో పేలాయి. గుంపులో కొద్దిగా చలనం వచ్చింది కాని అలాగే నిలబడింది. మళ్ళీ పదిసెకండ్ల తర్వాత రెండో రౌండు గుళ్ళు కొంచెం దిగువగా జనం తలల మీంచి దూసుకుపోయాయి. ఈ సారి జనం చెల్లాచెదురై పారిపోసాగారు.

".....మై తేరేకో దేఖ్‌లూంగా..... సారే... నా మీద కాలుస్తావా... బెహెన్ కీ... అక్కడ రోడ్లమీద తిరుగుతున్న జనం నీకేమవుతార్రా, వాళ్ళలో కర్ఫ్యూలేదా - సాలే యస్పీ - మై తేరే కో ఛోడూంగా నై.....' అని బూతులు తిడుతూ ఒంటరి అయిపోయిన నాయకుడు వెళ్ళి పోయాడు.

అరగంట తర్వాత పై అధికారుల దగ్గర నుంచి ఫోను వచ్చింది. శాంతి భద్రతల విషయంలో పోలీసులకి ఎంత బాధ్యత ఉందో, ప్రజలెన్నుకున్న ప్రజా ప్రతినిధులకి కూడా అంతే బాధ్యత ఉందనీ, వాళ్ళని నిర్లక్ష్యం చెయ్యడం,

అవమానించడం కూడదని మందలించారు పై అధికారులు.

అయిదు నిమిషాల తర్వాత రాష్ట్ర రాజధాని నుంచి ఫోను... సీనియర్ అధికారుల, అన్ని పార్టీల రాజకీయ నాయకుల బృందం ఒకటి పరిస్థితి పరిశీలిం చడానికి వస్తున్నదనీ, వారి రక్షణకు ఏర్పాట్లు చెయ్యాల్సిందనీ.....

మళ్ళీ ఫోను..... ఢిల్లీ నుంచి షాహీ ఇమామ్‌గారు ఎనిమిది కార్లలో వస్తున్నారట - ఈ ఉద్రిక్త పరిస్థితిలో హుస్నాబాద్ వెళ్లవద్దని వారిని కేంద్రప్రభుత్వం ప్రార్థిస్తోందట - ఒక వేళ వారు అంగీకరించని పక్షంలో హుస్నాబాద్ సరిహద్దుల్లో వారిని సగౌరవంగా అరెస్టుచేసి, అతిధి గృహంలో ఉంచి సకల మర్యాదలూ చెయ్యమని.....

ఫోనుమీద ఫోను అలా వస్తూనే ఉన్నాయి. ఆ తర్వాత యస్పీతో మాట్లాడ టానికి వీలు పడులేదు. పరిస్థితి గంట గంటకీ విషమిస్తోంది. రోడ్లమీద ఎక్కడ పడితే అక్కడ బారికేడ్లు - పోలీసు వాహనాలు కాని, ఫైరింజన్లు కాని నడవడం కష్టంగా ఉంది. ఒక పద్ధతి ప్రకారం దహనకాండ, హత్యాకాండ కొనసాగుతోంది. ఎక్కడ చూసినా మంటలు, పొగలు, ఆర్తనాదాలు...

పన్నెండు గంటలకి జిల్లా కేంద్రం నుంచి, సమీప ప్రాంతాల నుంచి కొద్దిగా పోలీసు బలగాలు, అగ్నిమాపక దళాలు వచ్చాయి. జిల్లా అంతా అల్లర్లు వ్యాపించ వచ్చున్న భయంతో జిల్లా అధికారులు పోలీసు బలగాలన్నింటినీ హుస్నాబాద్ తరలించ డానికి సాహసించలేదు. అయినా పరిస్థితిలో ఏవీ మార్పులేదు.

మధ్యాహ్నం రెండు గంటలకి రేపిడ్ ఏక్షన్ ఫోర్సు దిగింది. మర్నాడు ఉదయం తొమ్మిదింటికి సైన్యం దిగింది. సైన్యం దిగుతూనే బారికేడ్లు తొలగించి ప్రధాన మార్గాలు తెరిచి ఫ్లాగ్ మార్చ్ చేసింది. 'షూట్ ఎట్ సైట్' ఆర్డర్లు ఇవ్వబడ్డాయి. రోడ్డుమీద మనిషి కనిపిస్తే హెచ్చరిక లేకుండా కాల్పులు చేసింది సైన్యం దిగడంతో అప్పటి వరకు బీభత్సాన్ని సృష్టించిన మూకలు అదృశ్యమయి పోయాయి. సాయంకాలానికి ప్రశాంత పరిస్థితి నెలకొంది.

ఆ రాత్రి మిశ్రా, నేనూ సైన్యం జీపులో పట్టణమంతా తిరిగేం. కరెంటు లేదు. మసక వెన్నెల్లో పట్టణం స్మశానంలా నిశ్శబ్దంగా ఉంది. దారిలో ట్రక్కు ఒకటి కనిపించింది. అక్కడ కంపు దారుణంగా ఉంది. నేను, మిశ్రా జేబురుమాళ్ళు ముక్కుకి అడ్డం పెట్టుకున్నాం. అక్కడ మొహాలకి గుడ్డలు. కట్టుకున్న ఓ అరడజను మంది చీకట్లో, టార్చిలైటు సహాయంతో శవాలకోసం వెతుకు తున్నారు. గోనెపట్టాల మీదికి శవాల్ని ఎక్కించి ట్రక్కుల్లోకి విసురుతున్నారు. అలాంటి ట్రక్కులు మాకు దారిలో చాలా ఎదురయ్యాయి. నగరానికి వెలుపల శవాలు గుట్టలుగా పోసి పెట్రోలు చల్లి తగల బెడుతున్నారు. సైన్యాధికారి అనుమతితో మిశ్రా అక్కడ నాలుగైదు ఫోటోలు తీశాడు.




ఈ రెండు రోజుల్లోనూ ఎంతమంది చనిపోయారు? ప్రభుత్వం నాలుగైదు వంద లంటుంది. నా అంచనా ప్రకారం మూడువేలమందికి పైగా మరణించి ఉంటారు.

మర్నాడు ఉదయం హుస్నాబాద్ నుండి రంగాపూర్ సైన్యం జీపు ఒకటి వెడుతుంటే, రంగాపూర్‌దాకా జీపులో వెడితే అక్కడినుండి ఢిల్లీకి ట్రెయిన్ అందుకోవచ్చునన్న ఉద్దేశంతో జీపెక్కాం.

జీపు బయలు దేరబోతుండగా నాకు జెన్నీ గుర్తుకు వచ్చింది. ఈ గొడవల్లో పడి జెన్నీ విషయం పూర్తిగా మరచిపోయాను. ఆ అమ్మాయి ఢిల్లీ వెళ్ళిపోయిందో, ఇంకా స్టేషను మాష్టారింట్లోనే ఉందో తెలియదు. ఇంకా హుస్నాబాద్‌లోనే ఉండి ఉన్నట్లయితే జీపులో మాతో పాటే తీసుకు వెళ్ళవచ్చనే ఉద్దేశంతో జీపు స్టేషనువైపుకి పోనిమ్మన్నాను.

జెన్నీ వెళ్ళిపోలేదు. బతుకు బతుకు మంటూ స్టేషను మాష్టారింట్లోనే వుంది. స్టేషను మాష్టారింట్లో ఇంగ్లీషు వచ్చిన వాళ్ళెవరూ లేరు. ఈ రెండు రోజుల నుంచీ మాట్లాడేవారెవరూ లేక ఉందేమో - నన్ను చూడగానే నిట్టూర్చి, స్టేషను మాష్టారి కుటుంబానికి కృతజ్ఞతలు చెప్పి జీపెక్కింది.

'ఎవరీ అమ్మాయి?' అనడిగాడు జీపులో ఉన్న ఆర్మీ ఆఫీసరు'.

'జెన్నీ అని - ట్రెయిన్‌లో పరిచయమైంది'

'ఓహో - స్నేహితురాల్ని తీసుకుని ఈ బృందావనంలో విహారయాత్ర కొచ్చావన్నమాట' అన్నాడు అతను వెటకారంగా.

అతని ఆవేశాన్ని నేను అర్థం చేసు కున్నాను. ఏ పరిస్థితులలో ఆ అమ్మాయి కలసినదీ, స్టేషను మాష్టారింట్లో ఎలా ఉంచినదీ, జెన్నీకి అర్థంకాకుండా అతనికి హిందీలో చెప్పాను. అతను ఇంకేవీ మాట్లాడలేదు.

రంగాపూర్ వెళ్ళేదారిలోనే ఈ వివాస్పద మైన కట్టడం వుంది. మిశ్రా ఇంతకుముందే ఇదంతా చూసినా నేను మాత్రం చూడలేదు. ఆర్మీ ఆఫీసరుకి ఈ విషయం చెప్పి, అతను అనుమతిస్తే ఒకసారి అది చూసి వస్తానని చెప్పాను. ఈ సారి అతను చాలా మర్యాదగా మాట్లాడాడు - బహుశా తను ఇందాక అనవసరంగా దురుసుగా మాట్లాడానని అనిపించింది కాబోలు. జీపు దిగి తనుకూడా వచ్చాడు. జెన్నీ మాత్రం జీపులోనే ఉండి పోయింది.

రోడ్డు పక్కగా విశాలమైన ఖాళీస్థలంలో మర్రిచెట్టు నీడన ఉంది ఇంత వినాశ కాండకు కారణమైన కట్టడం. అక్కడ పోలీసు బందోబస్తు చాలా ఎక్కువగా ఉండడం వలన కాబోలు - మసీదు కాని, మందిరం కాని ఈ అల్లర్లలో ఏవీ దెబ్బతినలేదు. ఇంతకు ముందు ఆ గోడ ఎలా ఉండేదో కాని ఇప్పుడు గోడ కనుపించడం

లేదు. మందిరం దక్షిణవైపున వుంది. మసీదు ఉత్తరం వైపున వుంది. మందిరం పక్కనుంచే ఓ తారు రోడ్డు తూరుపువైపుకి పోతోంది. ఆ రోడ్డు పక్కగా, మసీదు - మందిరాల వెనుక, దాదాపు రెండు వందల గజాల దూరంలో ఓ గుట్టమీద స్టేట్‌బ్యాంక్, పోస్టాఫీసు, ఇంకా ఏవో గవర్నమెంటు ఆఫీసులూ ఉన్నాయి.

అదంతా చూసి మళ్ళీ జీపెక్కాం. రెండు గంటల తర్వాత మమ్మల్ని రంగాపూర్ స్టేషన్లో దించి జీపు వెళ్ళిపోయింది. రంగాపూర్‌లో చిన్న చిన్న చెదురుమదురు ఘటనలు జరిగినా ప్రశాంతంగా ఉంది. జన జీవనం మాములు గానే నడుస్తోంది.

మధ్యాహ్నం రెండు గంటలకి ఢిల్లీ వెళ్లే బండి ఎక్కాం. బండి కదిలిన తర్వాత సంభాషణ మొదలైంది. జీపులోకాని, స్టేషన్లో కాని పెద్ద సంభాషణలేవీ జరగలేదు. హుస్నాబాద్ తప్ప మరే విషయమైనా మాట్లాడాలని ఒక అంగీ కారాని కొచ్చినట్లు, అదీ ఇదీ మాట్లాడసాగాం. మిశ్రాకి జాన్సన్ కథంతా చెప్పాను. మిశ్రాకి ఫొటోగ్రఫీ పిచ్చి. జెన్నీ నడిగి జాన్సన్ ఆల్బం తీసుకుని తిరగెడయ్యడం మొదలు పెట్టాడు.

'ఇంత కష్టపడ్డా జాన్సన్ బంగ్లా చూడడానికి వీలుపడనందుకు నాకు విచారంగా వుంది' అన్నాను జెన్నీతో.

'ఏం చేస్తాం' అంది జెన్నీ నిరాశగా.

తర్వాత మళ్ళీ సంభాషణ ఆగిపోయింది. నేను కిటికీలోంచి బయటకు చూడసాగాను. అవే చెరకుతోటలు..... అవే దృశ్యాలు..... తేడా అల్లా అప్పుడు వెన్నెల..... ఇప్పుడు ఎండ..... రెండు రోజులే అయినా ఆ ప్రయాణం ఎంతో కాలం క్రితం చేసినట్లు అనిపిస్తోంది. ఎంత మనసు మరల్చు కొందామన్నా ఆలోచనలు హుస్నాబాద్ వైపుకి పరుగులు తియ్యడం మానలేదు..... మతం పేరిట ఎంత అర్థరహిత హత్యాకాండ? ఎన్ని వేల ప్రాణాలు బలి?

'ఎందుకు ఇలా జరుగుతోంది? లోపం హిందువుల్లోనా? ముస్లింలోనా? మనిషిలోనా? మతంలోనా? ఈ రోజు ఈ పరిస్థితికి కారణం ఏమిటి? గత చరిత్ర - విభజించి పాలించిన ఇంగ్లీషు వాళ్ళ రాజనీతి - మతం పేరిట దేశాన్ని ముక్కలు చేసి హిందూ ముస్లింల మధ్య ఒక అగాథం సృష్టించిన మతశక్తులు - మెజారిటీ మతస్తులనీ, మైనారిటీ మతస్తులనీ మతం. ప్రాతిపదికపై ప్రజలను చేర్చి, కొంతమందికి



"నిన్ను చూస్తుంటే నా కళ్ళు ఆనందంతో మెరిసిపోతున్నాయి రమా!"

"నాలో ఏముందని రవీ" మురిసిపోతూ అంది రమ.

"నీ మెడలో డైమండ్ నెక్లెస్ ఉందిగా" రమను దగ్గరకు తీసుకొంటూ చెప్పాడు రవి.

ప్రత్యేక హక్కులు, సదుపాయాలు ప్రసాదిస్తున్న 'లౌకిక'రాజ్యాంగం - చేదు నిజాల్ని నిర్భయం గా చెప్పే నిజాయితీ లోపించి, హిందూ మత తత్వాన్ని విమర్శించటమే సెక్యుల రిజంగా చిత్రిస్తూ, హిపోక్రెట్లుగా, కుహనా సెక్యుల రిష్టులుగా ప్రజల్లో అపఖ్యాతి పొందిన మేథావులు - వెనుక చూపే కాని ముందు చూపులేని మత నాయకులు - మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న రాజకీయ నాయకులు - గూండాలు - సంఘ విద్రోహక శక్తులు - పాకిస్థాన్ గూఢచారి శాఖ - ఈ నాటి పరిస్థితికి మూల కారణాలు వెతకడం కర్ణుడి చావుకి కారణాలు వెతకడం లాంటిదే!

అందరూ పెంచి పోషించిన ఈ విషసర్పం కాలనాగై ఇప్పుడు కాటు వేస్తోంది. ప్రతీ కల్లోలం పోలీసు కాల్పులకు, అరెస్టుల కు, నిర్బంధానికి దారి తీస్తుంది. నిర్బంధం ప్రజలకు, మతానికి మధ్య అనుబంధం పెంచుతుంది. పెరుగుతున్న మత నాయకుల పట్టు ప్రతీకార వాంఛ రగిలి స్తుంది. ఇదంతా మరో కల్లోలానికి దారి తీస్తుంది. ఇదొక విష వలయం. ఇది మొదలూ కాదూ; తుదీ కాదు. గతం ఎంత అంధకారమో, భవిష్యత్తుకూడా అంత అంధకారం.....

నా ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ, 'రావుసాబ్ - ఇదేమిటి?' అనడిగాడు ఆల్బం తిరగేస్తున్న మిశ్రా ఒక ఫొటో చూపించి.

'ఇదే జాన్సన్ బంగ్లా'

'ఇది.... గేటు పక్కన ఉన్నది?'

'అదా - అది జమ్మీ సమాధి'

జాన్సన్ ఒక ఎక్సెంట్రిక్. తనకేది తోస్తే అది చేసేవాడు. అతను ఏ ఆర్కిటెక్టుని సంప్రదించకుండా పెర్షియన్ వాస్తుశైలి, హిందూ వాస్తుశైలి, యూరోపియన్ వాస్తుశైలి - అన్నీ మేళవించి తనే తన దైవం సమాధికి రూపకల్పన చేశాడు. దానికి ఓ అందం, చందం లేదు.

నా సమాధానం వినగానే మిశ్రా మొహం పాలిపోయింది. - 'నువ్వు చెబుతున్నది నిజమేనా? వేళాకోళమాడటల్లేదు కదా,' అన్నాడు మిశ్రా.

'నిజమే వేళాకోళ మెందుకాడతాను జాన్సన్ ఆత్మకథలో ఇదంతా స్పష్టంగా రాశాడు - ఏం?' అన్నాను నేను.

'బాస్', మిశ్రా కంఠం చాలా సీరియస్‌గా ఉంది, 'ఈ ఫొటోలు రెండూ ఒకసారి జాగ్రత్తగా చూడు,' అన్నాడు రెండు ఫొటోలను పక్క పక్కనే పెట్టి. ఒకటి ఆల్బంలో జాన్సన్ బంగ్లా ఫొటో, రెండోది మసీదు - మందిరం రంగుల ఫొటో - మిశ్రా తీసినది.

రెండు ఫొటోలు మార్చి మార్చి చూశాను కాని నాకేవీ అర్థం కాలేదు.

'ఏవీ అర్థం కావడం లేదా?' అన్నాడు మిశ్రా.

'ఏమిటి అర్థం కావడం?'

'ఇప్పుడు జాగ్రత్తగా చూడు రెండు ఫొటోలు - మొదటి ఫొటోలో గేటు, గేటు లోంచి జాన్సన్ బంగ్లాకి పోతున్న కంకర రోడ్డు చూడు. నేను తీసిన ఫొటోలో మందిరం పక్కనుంచి పోతున్న తారురోడ్డు చూడు. జాన్సన్ బంగ్లా స్థానంలో అదే గుట్టమీద వెలిసిన ఆఫీసులు చూడు - అన్నిటికన్న ముఖ్యమైనది - రెండు ఫొటోల్లోనూ ఉన్న మర్రిచెట్టు చూడు.....' మిశ్రా వివరించ సాగాడు.

నాగరికత, కాలం, ఆ ప్రాంతంలో ఎన్ని మార్పులు తీసుకు వచ్చినా, జాన్సన్ బంగ్లా ఈనాడు పూర్తిగా మాయమైపోయినా, వాస్తవం పూర్తిగా మరుగున పడిపోలేదు. మిశ్రా చెబుతున్నది నా బుర్రకి మెల్లిగా ఎక్కసాగింది

'అంటే..... ఇది..... ఇది..... ఈ ఆవేశకావేషాలు..... ఈ దహనకాండ..... ఈ నరమేధం..... ఈ నెత్తుటి ఏరులూ..... ఈ కన్నీటి వరదలూ..... ఇదంతా..... ఇదంతా....' అన్నాను తెల్లబోతూ.

'నాకేవీ సందేహం లేదు' అన్నాడు మిశ్రా, రెండు ఫొటోలు కింద పడేస్తూ.

---